# 8. ఎరిపాత (భక్త) నాయనారు

చోళరాజ్యంలో ప్రధాన పట్టణమైన కరువూరులో ఎరిపాతనాయనారు జన్మిం చారు. అది చాలా పవిత్ర పుణ్యస్థలం. పట్టణము ప్రక్కనుంచి అంబరావతి నది పారుతూ వుంటుంది. ఆ నది యిరువైపులా ఋషులు తపస్సు చేస్తూ భక్తి తరంగాలు ప్రసరితం చేస్తూ వుంటారు. అచ్చట ప్రఖ్యాతి నొందిన పశుపతీశ్వరుని దేవాలయముంది. పసుపతీ శుడు రాజుకు ప్రజలకు శాంతి సుఖ సంతోషాలనిచ్చే ఇష్టదైవము. ఎరిపాత నాయనారు పశుపతినాథుని అనుదినము గొల్చేవాడు. శివభక్తులకు సేవచేసి, వారికి రక్షకుడుగా వుండుట ఆయన ధ్యేయము. ఒక గొడ్డలిని పుచ్చుకుని తిరిగేవాడు. శివభక్తులకెవరికైనా హాని తలపెడితే భక్తులకు సహాయముగా గొడ్డలిని చూపి హానిచేయువారిని శిక్షించే వాడు. ఇది శివుని పని అని తను చేస్తున్నట్లుగా భావించేవాడు.

ఆ వూళ్లోనే శివకామి ఆండార్ అనే ఇంకో శివభక్తుడున్నాడు. శివుని నియమ ముతప్పక అర్చించేవాడు. ప్రాతఃకాలమున అనుష్టానములు అయిన తర్వాత పూలను సేక రించడం వానిని మాలలగా గ్రుచ్చి దేవునికి సమర్పించడం గూడ అతని దైనందిన కార్య క్రమమయింది.

ఒక మహానవమి రోజున అందరూ ఆనందోత్సాహితులై యున్నప్పుడు శివకామిఆం డార్ ఎప్పటిలాగున పూలసజ్జ పుచ్చుకుని త్వరిత గతిని వెళ్తున్నాడు. ఆ క్షణం లోనే మావ టీండ్రు రాజుగారి ఏనుగును నదిలో స్నానము చేయించి ఏనుగుతో తిరిగి వస్తున్నారు. దానిమీద ఇద్దరు మావటీండ్రు వున్నారు. ముగ్గురు దానికి సహాయ రక్షకులుగా వున్నారు. ఎందుకనో దానికి మదమెక్కి మనుష్యులను తరుముట మొదలుపెట్టింది. వాళ్లంతా ఇటూ అటూ పరుగిడ మొదలు పెట్టారు. ఆ ఏనుగు శివకామి ఆండార్ దెసకు పరుగెత్తి శివకామి ఆండార్‌ను పుచ్చుకొని పూలబుట్ట అతని నుంచి లాక్కుని నేలమీద విసిరేసి వెళ్లిపోయింది. పూలన్నీ విరజిమ్మబడ్డాయి. శివకామిఆండార్‌కు మతి తప్పింది. దేవుని అర్చ నకై తాను సేకరించిన పూలన్నీ నేలపాలయ్యాయి. ఏనుగును తరిమాడు. తరుముతూ వ

యసు మళ్లినవాడు కాన అలిసి నేలమీద పడ్డాడు. బిగ్గరగా ఏడ్చాడు. శివా శివా అని బాధలో అరిచాడు.

ఎరిపాతనాయనారు ఆ బాటన పోతున్నాడు. శివకామిఆండార్ దీనమైన ఆక్రందన వినిపించింది. ఎరిపాతార్ - ఏనుగెక్కడ? అని ప్రశ్నించాడు. శివకామిఆండార్ చూపిన దెసకు పరుగెత్తి వీరభద్రావతారము దాల్చి ఏనుగు మీద తన గొడ్డలిని విసిరి ఏనుగును చంపేశాడు. మావటివాళ్లు అతనిమీదకు దండెత్తగా వాళ్లని గూడ అంతమొందించాడు.

ఏనుగు చంపబడిందన్న వార్త రాజుగారి చెవినపడింది. ఆయన వెంటనే సైనికులతో గుఱ్ఱం మీద వచ్చాడు. ఏనుగును ఎవరు చంపారో తెలియలేదు. అందుకని ఏనుగును ఎవరు చంపారు? అని గట్టిగా అరిచాడు. కొందరు ఎరిపాతార్‌ను చూపారు. శివయోగి ఇంకను రౌద్రముగా యున్నాడు. శివయోగిని చూడగానే రాజు గారి కోపము చల్లారింది. శివయోగి పనవుతే దానికి తగిన కారణముంటుంది. బహుశా తనను తాను రక్షించుకొనుటకు ఈ పనిచేసి వుండవచ్చును అనుకున్నాడు. ఎరిభక్తునితో ఇట్లా అన్నాడు. “స్వామీ ఏనుగును మీరు చంపారని అనుకోలేదు. ఏనుగు, మావటివాండ్రు మీకు అపకారము చేసి వుంటారు. వారికి తగిన శిక్షను మీరు ఇచ్చారు” ఎరిపాతార్ జరిగినది చెప్పాడు.

“ఏనుగు, మావటీండ్రు శివాపరాధమొనరించారు. అందుకు దానిని, వాళ్లను చంపాను” అన్నాడు. ‘శివాపరాధం’ అన్న మాట వినగానే రాజుగారి మనసులో వేదన కలిగింది. ఎరిపాతార్ కాళ్లమీద పడ్డాడు. ‘స్వామీ! వాళ్లు చేసిన అపరాధానికి మీరు విధించిన శిక్ష స్వల్పము. అటువంటి ఏనుగును అటువంటి మావటివాళ్లను పెట్టుకున్నందుకు నేను ఇంకా పెద్ద అపరాధము చేశాను. మీ పవిత్రమైన ఆయుధము (గొడ్డలి)తో నన్ను చంపవద్దు. ఇదిగో నా కత్తి. దీనితో నా తలను ఉత్తరించండి” అని ప్రార్థించాడు.

ఎరిపాతార్ ఆ మాటలు విని నిశ్చేష్టితుడయ్యాడు. తనుగూడ పశ్చాతాపముతో బాధపడ్డాడు. రాజుగారికి, మహాపవిత్రుడైన రాజుగారికి నేనెంత వేదనను కలిగించాను?

రాజు ఎంత ఉన్నతుడు? అనుకొని రాజుగారు తన్ను తాను అంతమొందించుకొను నేమో యని రాజు వద్ద నుండి కత్తిని లాక్కున్నాడు. రాజుగారి దుస్థితికి ఎరిపాతార్ తానే కారణ మని ఎంచి తనకు తానే శిక్ష విధించుకొని తన కంఠంను ఉత్తరించుకోబోయాడు. రాజుగారు తన మూలాన్ని ఇంకో ఘాతుకము జరుగబోతూందని - ఎరిపాతార్ చేయిని, కత్తిని గట్టిగా పట్టుకొని కంఠం ఉత్తరించుకోకుండా ఆపాడు.

పరమశివుని లీల పూర్తయింది. అశరీర వాక్కు వినిపించింది. “మహానుభావు లారా! ఇదంతా పశుపతీశ్వరుని లీల. ప్రపంచంకు ఈ భక్తుల మహాభక్తి తత్పరత తెలియ గలందులకు ఇది జరిగింది” తక్షణమే ఏనుగు, మావటివాళ్లు పునర్జీవితులయ్యారు. శివ కామి ఆండార్ పూజసెజ్జ పూలతో నిండిపోయింది. అందరూ ఆశ్చర్యచకితులై పశుపతీశ్వ రుని మీద ఆయన విశేషాన్ని కీర్తిస్తూ ఆనందంతో భక్తినిరతితో పాడారు.

ఎరిపాతార్ ఖడ్గమును రాజుగారి పాదాలముందు పెట్టి సాష్టాంగపడ్డాడు. రాజు గారు కూడా ఎరిపాతార్ కాళ్లకు మ్రొక్కాడు. ఇద్దరు ఆనందతో ఒకరి నొకరు పరిష్వంగ నం చేసికొన్నారు. ఎరిపాతార్ రాజుగారిని ఏనుగునెక్కించి సాగనంపాడు. తన స్థానానికి తాను వెళ్లాడు. శివకామి ఆండార్ పూలసజ్జతో ఆలయంలోకి వెళ్లాడు

ఎరిపాతార్ శివభక్తులను సేవిస్తూ అంత్యమున శివసాయుజ్యమొందినాడు.